# సంసార వీణ




వారణాసి నాగలక్ష్మి

చామన చాయలో, సామాన్యమైన ఎత్తులో, పెదవుల మీద నిరంతరం నర్తించే చిరునవ్వుతో, తీరైన కనుముక్కు తీరుతో, అన్నిటినీ మించి ఎలాంటి సమస్యనైనా అవలీలగా ఎదుర్కొన గలిగే ఆత్మ స్థైర్యంతో పిన్ని ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. ఆటో దిగుతూనే ఎదురొచ్చిన పిన్నిని ఆర్తిగా వాటేసుకున్నాను. కళ్ళు చెమ్మగిల్లాయి.

'పిచ్చిపిల్లా' అంటూ ఒక్కక్షణం నన్ను ఆప్యాయంగా హత్తుకుని నా సూట్‌కేస్ అందుకో బోయింది. ఉప్పొంగి రాబోయిన కన్నీటిని కష్టంమీద ఆపుకున్నాను. ఆటో ఛార్జీలు చెల్లించి పిన్ని వెనుక లోపలికి నడిచాను. అగరువత్తుల సుగంధం వెనుకే, పూజగది లోంచి బాబాయి పలకరింపు "ఏమిటమ్మా! అంతా బావున్నారా?" అంటూ.

కాలకృత్యాలు పూర్తి చేసుకుని, స్నానం చేసి వంట గదిలోకి వెళ్ళేసరికి పిన్ని హడావుడిగా వంట కానిస్తూనే రెండో స్టవ్ మీద నాకు కాఫీకి పాలు పెట్టింది. విశాలంగా వున్న ఆ గదిలోనే డైనింగ్ టేబిల్ కూడా వుంది. పిన్ని కాఫీ కలుపుతూంటే అక్కడే కుర్చీలో కూర్చున్నాను. నా అనుకునే ఒక మనిషి సమక్షం మనసులో ఏదో సెక్యూరిటీని ఇస్తున్నట్టు అన్పిస్తుంటే, ఇటీవల నా వైవాహిక జీవితంలో చోటు చేసుకున్న కలతలు గుర్తొచ్చి మనసు భారమైంది. పైకి ఏవో మాట్లాడుతున్నా మనసులో పిన్ని గురించే ఆలోచిస్తున్నాను. బాబాయి చాలా కోపిష్ఠివాడని, పిన్నిని చాలా చులకనగా చూస్తాడని, గృహ విషయాల్లో పిన్నికేవిధమైన స్వాతంత్ర్యం లేదని మా బంధువుల్లో చెప్పుకుంటారు. మరి పిన్ని తొణక్కుండా ఇలా నిత్య సంతోషిలా ఎలా ఉండగలుగుతోంది? చిన్న చెఱువుని మదపుటేనుగు అల్లకల్లోలం చేసినట్టు మనసు సమస్యలు ఎదురైనపుడు ఎంతో కలత చెందుతుంది. మరి పిన్ని మనసు సముద్రం లాంటిదేమో! నలుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసి ఎన్నో ఒడిదుడుకులకి తట్టుకుని చిఱునవ్వు చెదరకుండా వుండి పోయింది!

"ఏమిటే పద్మా! ఒకటే ఆలోచిస్తున్నావు?" కాఫీగ్లాసు అందిస్తూ అడిగింది పిన్ని. ఇంత హఠాత్తుగా వచ్చినా 'ఏమిటిలా వచ్చావని ప్రశ్నించని తన సంస్కారాన్ని హర్షిస్తూ

"నీ గురించే పిన్నీ! ఎప్పుడూ నవ్వుతూ ఎలా వుంటావా అని!" తేలిగ్గా నవ్వేయాలని ప్రయత్నించాను.

పిన్ని మనోహరంగా నవ్వుతూ "దేవుడు నన్ను సృష్టించేటప్పుడు పెదవులు సాగదీసి వదిలేశాడే. దాంతో నా మొహమే అలా అయిపోయింది" అంది. నాకూ నవ్వొచ్చింది గాని రవి గుర్తొచ్చి మనసు భారంగా అయిపోయింది. ఎంతో ఆనందంగా సాగాల్సిన సంసారం మాది. బాధ్యతల బరువులూ లేవు. చెప్పుకోదగ్గ సమస్యలూ లేవు. అయినా క్రితం సంవత్సరం నుంచి రవి ప్రవర్తనలో ఏదో మార్పు వచ్చింది. అతన్నర్థం చేసుకుందుకు ఎంత ప్రయత్నించినా ఇతను నాకు తెలిసిన రవి కాదు అన్పించేలా ప్రవర్తిస్తున్నాడు. ఆఫీసులో ఎవరో లేడీ క్లర్కు అతనితో చనువుగా వుంటోందని విని, అడిగితే నామీద విరుచుకు పడ్డాడు. కొన్నాళ్ళు మౌన వ్రతం. రోజూ రాత్రి పది దాటాక ఇల్లు చేరడం, ఏదేనా ప్రశ్నిస్తే నామీద అరవడం ప్రతి దానికీ విసుక్కోవడం మొదలు పెట్టాడు. దానితో అతనితో మాట్లాడాలనే కోరికే పోయింది నాలో. మెల్లిగా ఇద్దరి మధ్యా తెలియని దూరం పెరుగుతూ వచ్చింది. అనురాగం క్రమంగా హరించుకు పోయి, ఒకరకమైన అయిష్టత మొదలైంది. నా పట్ల అతని ప్రవర్తన తలుచుకుంటే 'ఇతన్నేనా నా సర్వస్వంగా భావించాను?' అన్పిస్తోంది. పెళ్ళై ఆరేళ్ళు దాటుతున్నా పిల్లలు కలగలేదనే చింత మనసుని దొలిచేస్తోంది. పూర్వం ఆ బాధని ఇద్దరం పంచుకునే వాళ్ళం. ఈ మధ్య నాతిగల బ్రహ్మచర్యంలా భర్తవుండీ వివరించలేని ఒంటరితనానికి గురవుతున్నాను. జీవితంలో ఏర్పడ్డ మొనాటనీ నుంచి ఏదో విధమైన మార్పుని కోరుతోంది మనసు.

పిల్లలతో జీవితానికి పరిపూర్ణత కలుగుతుందన్నది నిజమే కానీ పిల్లలు లేనంత మాత్రాన కృంగి, కృశించి పోయేటంత బేలతన మేమీ లేదునాలో. కాని ముద్దులొలికే పిల్లల్ని చూసి నప్పుడు ఒక రకమైన డిప్రెషన్ కలుగుతోంది. అలాంటప్పుడు రవి నా మనసునర్థం చేసుకుని కొంచెం ఆప్యాయంగా మాట్లాడితే బావుండు నన్పిస్తుంది. రాత్రి ఆలస్యంగా ఇల్లు చేరి నా మనోభావాలతో, బాధలతో, ఇంటి బాధ్యతలతో పని లేనట్టు ప్రవర్తించే అతన్ని చూస్తుంటే ఏదో తెలియని భావం అగ్నిలా చెలరేగుతుంది మనసులో.

రెండు రోజుల క్రితం అతను ఇల్లు చేరేసరికే పదకొండు గంటలైంది. కోపాన్ని అణుచుకుని మాట్లాడకుండా భోజనం వడ్డించ బోతుంటే 'పార్టీ వుంది. తినేశాను' అన్నాడు మొక్కుబడిగా.

నాకు ఒళ్ళు మండిపోయింది. "ఇంట్లో ఫోనుంది. భోజనానికి రానని ఒక్కముక్క చెప్పొచ్చు. మీలాంటి మనిషి కోసం ఇప్పటిదాకా తినకుండా ఉండడం నాదే బుద్ధి తక్కువ" అన్నాను.

నావేపు తిరస్కారంగా చూసి 'పెళ్ళాం నవ్వుతూ ఉండాలంటే ఆ మొగుడేదో పుణ్యాం చేసుకుని వుండాలి" అన్నాడు నేనేదో అపరాధం చేసినట్టు.

"అవును. మొగుడు నవ్వుతూ హుషారుగా వుండాలన్నా ఆ పెళ్ళాం ఏదో పుణ్యాం చేసుకుని వుండాలి. మీలాంటి మనిషితో ఎలా కాపురంచెయ్యగలుగుతున్నానో నాకే అర్థం కావడం లేదు" అంటుంటేనే గొంతు గద్గదమై కళ్ళ నీళ్ళు తిరిగాయి. ఆ సంఘటన 'లాస్ట్ స్ట్రా ఆన్ కామెల్స్ బాక్' లా అయింది. నా మనసు విరిగిపోయింది. పెళ్ళైన సంవత్సరానికే తల్లిదండ్రులిద్దర్నీ పోగొట్టుకున్న నన్ను తానే అన్నీ అయి చూసుకోవల్సింది పోయి ఇలా 'ఇల్‌ట్రీట్' చేస్తుంటే, ఎక్కడో అమెరికాలో సెటిల్ అయిపోయిన అన్నయ్యకి

చెప్పుకోలేక లోలోపలే నంవత్సరంగా ఎంత బాధ అనుభవించానో ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు.

మనసు
వెతల ఊట బావి
కళ్ళ చేదలతో
ఎంత తోడినా
ఎంతకీ తరగనిదా
జలనిధి!

ఎడతెగని దుఃఖాశ్రువులు దిండులోకి ఇంకిపోతుంటే తెల్లవారింది. రవి నాతో ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్ళిపోతుంటే అన్నాను... "ఇద్దరం ఇలా వున్నప్పుడు కలిసి వుండడంలో అర్థం లేదు. కొన్నాళ్ళు నేను మా పిన్ని ఇంటికి వెళ్దామనుకుంటున్నాను" అన్నాను.

సాయంత్రం ఇంటికి వస్తూనే హైదరాబాద్‌కి బస్ టికెట్ ఒకటి అందించాడు! నా అభిమానం దెబ్బతింది. తర్వాత ఏం చెయ్యాలో తర్వాత ఆలోచిద్దాం అన్పించి, పదిరోజులకి బట్టలు సర్దుకుని బస్ ఎక్కేశాను. నా చిన్నప్పటినుంచి పిన్ని దగ్గర నాకు బాగా చేరిక. ఇప్పుడు తనకే అంతా చెప్పుకోవాలనీ, తన నలహా ప్రకారం నడుచుకోవాలని నిశ్చయించుకున్నాను.

నా కాఫీ పూర్తయేనరికి పిన్ని వంట అయింది. బాబాయి భోజనానికి వచ్చాడు. అన్నీ పద్ధతిగా అమర్చి శ్రద్ధగా ఆయనకు వడ్డిస్తూ నాతో సంభాషిస్తోంది పిన్ని.

"నెయ్యి కరిగించలేదా? ఇంతోటి వంటలోనూ ఏదోటి మర్చిపోకుండా అవదు" చిరాకు పడ్డాడు బాబాయి.

నాకు చివుక్కు మన్పించింది. పిన్ని మాత్రం "అయ్యో! మర్చిపోయాను సుమండి" అని నవ్వేస్తూ గిన్నె తీసుకెళ్ళి నెయ్యి కరిగించి తెచ్చింది. ఈ లోపు కూర ఇంకా బాగా ఎలా చెయ్యొచ్చో చెప్పాడు బాబాయి. పులుసులో ఆనపకాయ ముక్కలు తప్పించి ఇంకేం లేవని విసుక్కున్నాడు. పెరుగు కమ్మగా తోడుపెట్టడం చేత కాదన్నాడు. అన్నిటికీ నవ్వుతూ, సింపుల్‌గా నమాధానాలిస్తూ ఆయన భోజనమై వెళ్ళిందాకా తనెలా భరించిందో గాని, నాకు కోపం, ఆశ్చర్యం కలిగాయి.

వీధి తలుపుకేసి పిన్ని లోపలికి రాగానే అడిగేశాను. 'పిన్నీ! ఈ మగవాళ్ళంతా ఇలా ఎందుకుంటారు? బాబాయ్ అలా మాట్లాడినా నువ్వెందుకు భరిస్తావు?" అని.

పిన్ని మళ్ళీ నవ్వి "నంసారంలో మొగుడి మీద పెళ్ళాం, పెళ్ళాంమీద మొగుడూ చిరాకు పడకుండా అవుతుందిటే?" అంది.

అది మొదలు బాబాయి రోజూ కనీసం అరడజను సార్లైనా అనవసరంగా ఏదో వంకన పిన్నిమీద చిరాకు పడ్డం, విసుక్కోవడం, ఎగతాళి చెయ్యడం చూస్తున్న నాకు పిన్నిలోని ప్రశాంతత ఆశ్చర్యంగా తోచింది. చివరికి ఓరోజు రాత్రి మేడమీద ఇద్దరం కూర్చున్నప్పుడు రవి ప్రవర్తన గురించి పిన్నికి చెప్పాను, తడికళ్ళతో.

'పిన్నీ! బాబాయిని కూడా చూస్తున్నాను గదా. నీలాంటి అపురూపమైన వ్యక్తిని భార్యగా పొందీ, ఇలా ప్రవర్తించడానికి కారణం ఏమిటి?'' అనడిగాను.

పిన్ని కొంతసేపు చిరునవ్వుతో ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది. చివరికి "పద్మా! నంసారంలో 'టుబి హేపీ ఈజ్ మోర్ ఇంపార్టెంట్ దాన్ టు బి రైట్' అనే సూక్తి వినలేదా? మీ బాబాయి ఆఫీసులో ఏవో పాలిటిక్స్‌తో చాలా నమస్యల్లో వున్నారు. ఆఫీస్‌కి వెళ్ళేముందు, ఇంటికి వచ్చిన వెంటనే ఆయనకి చిరాగ్గా వుంటుంది. ఏదో వంకతీసుకుని ఆ చిరాకు వెళ్ళగ్రక్కుతూ వుంటారు. నాకు కారణం తెలుసు కనుక నన్ను ఉద్దేశించి అన్నట్టుగా నాకన్పించదు. పైగా ఆయన టెన్షన్ తగ్గించడానికి నేను సాయం చేస్తున్నాను కదా అని నంతోషిస్తాను.... నిజం..! ఏదేనా టిఫిన్ చేస్తే రుచిగా అన్పించి మళ్ళీ వేసుకుని తింటూ కూడా ఏదో కామెంట్ చేస్తారు. నేను మనసులో నవ్వుకుంటాను. మళ్ళీ నేనెక్కడికేనా వెళ్తే ఆ ఒక్కరోజు కూడా నా ఆసరా లేందే గడపలేరు. ఇల్లంతా శూన్యమైపోయినట్టు తను ఒంటరి అయిపోయినట్టు బాధపడతారు. నేను రాగానే 'ఆపనవలేదు.. ఈ పనవలేదు.. ఎప్పుడు పడితే అపుడు ఇల్లొదిలి వెళ్ళిపోతే ఎవరు చూసుకుంటారివన్నీ?' అని ఎగురుతారు. ఆ మాటలు నాకు 'నన్ను వదిలి వెళ్ళిపోతే నేనేమైపోతాను?' అన్నట్టుగా విన్పిస్తాయి. అందుకే నవ్వుతూ ఉండగలుగుతాను. ఇన్నేళ్ళుగా ఆయన మనసు, ఆలోచన్లు, పతిచేష్ట వెనుక అర్థం అన్నీ అలవాటైపోయాయి. పిల్లలంతా పెద్దవాళ్ళైఎవరింటికి వాళ్ళు వెళ్ళిపోయినా మేమిద్దరం ఒకరికొకరం అనేభావం నాకా వెలితి కనపడకుండా చేసింది...." పిన్నిని చూస్తుంటే ఏదో మిస్టరీ విడుతున్నట్టు అనిపించింది.

"మరి నానమస్యకి పరిష్కారం ఏమిటి?" అన్నాను.

"నువు చెప్పేతీరుని బట్టి అతనికీ ఆఫీసులో ఏదో నమస్య వున్నట్టే అన్పిస్తోంది. దానికి తోడు ఈ లేడీక్లర్కు కూడా కావాలని అతి చనువుగా ప్రవర్తిస్తూండవచ్చు. లేదా ఇద్దరూ ఆఫీసు విషయంలో ఒకేలాంటి నమస్యని ఎదుర్కొంటూండడం వల్ల కొంత సాన్నిహిత్యం ఏర్పడి వుండవచ్చు. గోరంతలు కొండంతలు చేసి నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారని బాధపడుతూ వుండవచ్చు. ఆమెతో కరుగ్గా వుండలేక చిరాకు పడుతూ వుండవచ్చు!"

"తలుచుకుంటే కోపం వస్తుంది పిన్నీ! అదే పరిస్థితిలో నేనుంటే తన అనుమానాల్తో ఎంత నతాయించి వుండేవాడు? 'ఇలా ఎవరో అనుకుంటుంటే విన్నాను' అనగానే వివరించి చెప్పాల్సింది పోయి, నామీద ఎగిరిపడ్డాడు."

" అదేనే.. నలుగురూ చెవులు కొరుక్కుంటూంటే భరించలేక వీలున్నచోట ఆ టెన్షన్ రిలీవ్ చేసుకుందుకు ప్రయత్నిస్తున్నాడన్న మాట. అలాంటపుడు నువ్వొక నంతోషాన్ని పంచి ఇచ్చే సోర్స్‌లా కనిపిస్తే నీమీద చిరాకుపడి తన చిరాకు వదల్చుకుని మెల్లిగా నీనుంచి నంతోషాన్ని అందుకునే సావకాశం వుంటుంది. నువ్వే డల్‌గా వుంటూ అతను లేటుగా వచ్చినందుకు బాధపడుతూ అలాంటి విషయాల్లో అతన్ని ఎక్స్‌ప్లనేషన్ అడిగితే నీమీద విరుచుకుపడి, ఎలా ఈ విషస్ సైకిల్ నుంచి బాటపడాలో తెలీక ఒంటరిగా ఉండడానికి ప్రయత్నిస్తాడు. నిన్ను బాధ పెడుతున్నందుకు పైకేమీ చెప్పకపోయినా లోలోపల గిల్టీగా ఫీలవుతాడు. ఏ వ్యక్తీ తనను గిల్టీగా ఫీలయేలా చేసే వ్యక్తిని ప్రేమించలేడు. అదే నువ్వు అతని మాటల్ని చేష్టల్ని పట్టించుకోకుండా అతని ఇంటెన్షన్‌ని గ్రహించి దానికి తగ్గట్టు ప్రవర్తించి చూడు. అతని మానసికావసరాలు గ్రహించడానికి అంతర్గతంగా ప్రయత్నించి చూడు. నవ్వుతూ జోక్స్ చెపుతూ ఇద్దరికీ తెలిసిన వాళ్ళ గురించి ఏదో సంభాషణ జరుపుతూ ఒక రకమైన 'హాపీహెరామ్' వాతావరణాన్ని సృష్టిస్తావనుకో.. మెల్లిగా అతను త్వరగా ఇంటికి రావడానికి ప్రయత్నిస్తాడు. 'అదే పరిస్థితిలో నేనుంటే' అనడిగావు చూడు... అలాంటి ఆలోచనా నరళి అలవాటు చేసుకోకు. 'అతను మగవాడు, నువ్వు స్త్రీవి అనే డిస్‌క్రిమినేషన్ వదిలెయ్యి. అతనో వ్యక్తి, నువ్వో వ్యక్తివి. అతన్నుంచి నువు కొంత, నీనుంచి అతను కొంత ఆశించడం సహజం. అతను నువ్వాశించే ఆ కొంతకూడా ఇవ్వడం లేదు. అలా అని అతనితో వాదించడం వల్ల ఉపయోగం లేదు.వుంటుందా? నీ ఈ నమస్య ఎంత జటిలమైనదో, అతని వల్ల నీకెంత కష్టం కలుగుతోందో ఇవే ఆలోచించడం వల్ల, పునరాలోచించడం వల్ల, అతను మగవాడు గనుక మగవాళ్ళని అందర్నీ విమర్శించడం వల్ల ఉపయోగం లేదు! ఏం చేస్తే ఇద్దరికీ సుఖశాంతులు దొరుకుతాయో అది చెయ్యాలి! భార్యా భర్తలిద్దరూ ఇంటలెక్చువల్‌గా ఒకే లెవల్‌లో ఉండడం సామాన్యంగా జరగదు. తక్కువ లెవల్‌లో ఉన్నవాళ్ళు సాధారణంగా 'ప్రివిలేజ్డ్'గా ఉంటారు. లేదా ఇద్దరూ వాదులాడుకుంటూ బాధపడుతూ ఉంటారు. ఈ ప్రాసెస్‌లో ఒకళ్ళు ఎక్కువ బరువుమొయ్యాల్సి వస్తుంది. కానీ నతులితం తప్పకుండా వుంటుంది. అర్థమైందా?"

తలవూపాను.

"కనుక అతన్ని నువ్వెలా టాకిల్ చెయ్యాలో ఆలోచించుకో. అతనెలా ప్రవర్తిస్తే బావుంటుందో నువ్వాలోచించకు. ఎందుకంటే అతని ప్రవర్తన నీ కంట్రోల్‌లో లేదు. నీ అధిపత్యం అల్లా నీ మనసు మీదా, నీ మీదే!"

"నాకేం తెలీడం లేదు పిన్నీ!" అన్నాను.

"పిచ్చిపిల్లా! నేనెందుకు లొంగి వుండాలి? నాకూ సమాన హక్కులున్నాయి అనుకుంటున్నావా?"

"......"

"నరే. నీ అంతట నువ్వు ఇండిపెండెంట్‌గా బ్రతకగలవా? విడిపోవాలనే ఆలోచన నీమనసులో వుందా?"

'ఉహు" వెంటనే అన్నాను. రవి ప్రవర్తన భరించడానికి ఎంత బాధాకరంగా వున్నా విడిపోవాలన్పించేంత దూరం వెళ్ళడం లేదు ఆలోచన. నమస్య ఇంకా అంత తీవ్రం కాలేదన్పిస్తోంది.

"చూశావా? అతనిపట్ల నీకు ప్రేమ వుంది నీ మనసు లోతుల్లో అతనితో నువు పంచుకున్న ఆనందానుభూతుల గుర్తులు వున్నాయి. అందుకే అతన్ని నీ దగ్గరకు మానసికంగా ఎలా తెచ్చుకోవాలో ఆలోచించు... అతన్ని ఈ విషయాలేవీ ప్రశ్నించకు. అలా అని నీకేమీ పట్టనట్టు వుండకు. ఇంట్లో అతనెంతసేపు వుంటే అంతసేపు అతనితో ప్రేమగా వుండు. అతనేదైనా అన్నా తొణక్కుండా తేలిగ్గా తీసుకుందుకు ప్రయత్నిస్తూండు. మౌనం వహించాల్సి వస్తే నరే... ముభావంగా మాత్రం వుండకు. అతను చిరాకు పడితే నువ్వూ చిరాకు పడక అతని పట్ల కన్‌సర్న్ చూపిస్తూ వుండు. అతని చిరాకు నీమీద కాదని గ్రహించి మనసు తేలిగ్గా వుంచుకుందుకు ప్రయత్నించు. పైకి మాత్రం "అయ్యో! అలాగా! నే చూడలేదు రవీ" అనో "సారీ రవీ! ఈసారి జాగ్రత్తగా చేస్తాను" అనో అంటూండు. ఇందువల్ల నిన్ను నువు చులకన చేసుకుంటున్నావనే భావన రానీకు. నామటుకు నాకు నమస్యలు ఏర్పడ్డప్పుడు ఉక్కిరిబిక్కిరి అయిపోతూ ఇతర్లకి-తాము మరో రకమైన నమస్యలు కల్పించేవాళ్ళ పట్ల గౌరవం లేదు. నాదృష్టిలో వాళ్ళు మానసికంగా పరిణతి చెందని వాళ్ళు. అలాంటివాళ్ళతో కూడా నర్దుకుని తెలివిగా జీవితాన్ని సుఖమయం చేసుకోగలిగే వాళ్ళపట్ల నాకెంతో అభిమానం, గౌరవం. నిజానికి నేచెప్పిన విధంగా నువ్వు అతనికి చేయూతనిస్తే అతను నీమీద ఆధారపడడానికి అలవాటు పడతాడు. నీపట్ల గౌరవం పెంచుకుంటాడు. అప్పుడు ఎక్కడున్నా పని త్వరగా పూర్తి చేసుకుని ఇల్లు చేరాలని ఆరాట పడతాడు. తన సుఖదుఃఖాలు నీదగ్గర కాన్ఫిడెన్షియల్‌గా వుంటా యని అర్థమయ్యాక, కొన్నాళ్ళ తర్వాతైనా వాటిని నీతోనే పంచుకోవడం మొదలు పెడతాడు. అన్ని నమస్యలూ తేలికగా పరిష్కారమవుతాయి. తెలిసిందా?"

నవ్వుతూ "తెలిసింది" అన్నాను. పిన్ని మొహంలో చెదరని దరహాసరేఖలకి అర్థం తెలిసిందిగా మరి! *